అన్నదాతకు అందని భరోసా

- ఖరీఫ్ ముగిసింది.. రబీ ఆరంభమైంది
- సాగును పట్టించుకోని ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్పుకే పరిమితం


కొత్తవీరాపురంలో రబీ సీజన్‌కు దుక్కులు చేస్తున్న ట్రాక్టర్

ఏర్పేడు: దేశానికి వెన్నెముక లాంటి అన్నదాతకు ప్రభుత్వం నుంచి భరోసా అందలేదు. కూటమి ప్రభుత్వంలో వ్యవసాయం ముందుకు సాగడం లేదు. రైతులకు అవస్థలు తప్పడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చొప్పున చెల్లిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి 4 నెలలవుతున్నా ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ముగిసిపోయి రబీ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం మాత్రం అసలు వ్యవసాయం గురించి పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తప్పని ఎదురు చూపులు

గత ఖరీఫ్ సీజన్‌లో కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేసి సాగు చేశారు. ఎరువుల కొనుగోలుకు అప్పులు చేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించింది. ఖరీఫ్ సీజన్‌లో వేసిన వరి దిగుబడులు తగ్గడంతో అప్పుల పాలైనట్లు రైతులు వాపోతున్నారు. కనీసం రబీ సీజన్‌లోనైనా కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం కోసం రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

మండలంలో గత ఐదేళ్లలో రైతుభరోసా కింద అందించిన నిధుల వివరాలు.. 2019–20లో 9,533 మంది రైతులకుగాను రూ.12.86 కోట్లు, 2020–21లో 9,875 మంది రైతులకుగాను రూ.13.3 కోట్లు, 2021–22లో 10,164 మంది రైతులకుగాను రూ.13.7 కోట్లు, 2022–23లో 11,032 మంది రైతులకుగాను రూ.14.89 కోట్లు, 2023–24లో 11,736 మంది రైతులకుగాను రూ.15.8 కోట్లు ఖాతాలో జమ చేసింది. రైతులు పంట సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా రైతుభరోసా పథకాన్ని అమలు చేసింది. రైతుభరోసా కింద రూ.7500, పీఎం కిసాన్ పథకం కింద రూ.6 వేలు కలిపి ఏడాదికి రూ.13,500 చొప్పున రైతుల ఖాతాల్లో జమచేసింది. అంతేకాకుండా కౌలు రైతులతోపాటు ఆర్ఓఎఫ్ఆర్, డీకేటీ పట్టాలు పొందిన రైతులను కూడా ఆదుకోవాలనే పెద్దమనసుతో వారికి కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింపచేసింది.

సుఖీభవ ఏది బాబూ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా రూ. 20 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 4 నెలలు గడుస్తున్నా హామీ నెరవేర్చలేదు. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా అందేది. సాగుకు అప్పులు చేయాల్సిన పనిలేకుండా ఉండేది. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. – భాస్కర్‌రెడ్డి, రైతు, ఏర్పేడు మండలం

హామీ అమలు చేయాలి



అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు భరోసా ఇవ్వకపోతే వ్యవసాయం ఎలా చేస్తారు. గత ప్రభుత్వంలో పెట్టుబడి సాయం సాయం అందేది. ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ఇప్పటివరకు అన్నదాతలను కానీ, వ్యవసాయ రంగాన్ని కానీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. రైతుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. చంద్రబాబు పాలనలో మళ్లీ అవస్థలు తప్పేలా లేవు. –పెంచలరెడ్డి, రైతు, ఏర్పేడు మండలం

క్లుప్తంగా

ముళ్లపొదలు తొలగించండి


ఆర్‌బీకే వద్దనున్న ముళ్లపొదలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట గ్రామ రైతు భరోసా కేంద్రం ముందు ఉన్న ముళ్లపొదలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ముళ్లపొదల మూలాన రైతులు ఎరువులను తీసుకెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది పట్టించుకోక పోవటంతోనే ముళ్లపొదలు పెరిగిపోయాయని, ఇకనైనా వాటిని తొలగించాలని కోరారు.

ఎంపీడీఓగా బాలాజి నాయక్



నాగలాపురం: ఎంపీడీఓగా బాలాజి నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చంద్రగిరి నుంచి ఆయన బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇక్కడ పని చేస్తున్న పీఎంకె బాబును కడప జిల్లాకు బదిలీ చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను అర్హులకందేలా చూస్తానని నూతన ఎంపీడీఓ చెప్పారు.

డీటీగా లావణ్య



డిప్యూటీ తహసీల్దార్‌గా లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. లావణ్య మాట్లాడుతూ, మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఉపాధి పనులతో వలసల నివారణ


పనులను పరిశీలిస్తున్న నేషనల్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధి సుధాకర్‌రెడ్డి

రేణిగుంట: ఉపాధి హామీ పనుల వల్ల గ్రామీణ ప్రజలకు సమృద్ధిగా పని దొరుకుతోందని, తద్వారా వలసలు లేని గ్రామాలు తయారయ్యాయని నేషనల్ మానిటరింగ్ టీం ప్రతినిధి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాజుల మండ్యం, సూరప్పకేశం పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గాజులమండ్యంలో కొబ్బరి చెట్ల పెంపకం యూనిట్‌ను పరిశీలించి రైతు సుమన్‌తో మాట్లాడి పథకం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీలు సరిత, ప్రేమ్‌కుమార్, మండల ఏపీవో జ్యోతిశ్రీ, సర్పంచ్ గంగారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి


మోదుగులపాలెంలో ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ప్రసాదరావు

ఏర్పేడు: రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు అన్నారు. మండలంలోని మోదుగులపాలెం, వికృతమాల పొలాల్లో శుక్రవారం జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతింటే ఈ పంట నమోదుతో ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించడానికి అవకాశం ఉంటుందని సూచించారు. ప్రతి రైతు సంబంధిత వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ షణ్ముగం, అగ్రికల్చర్ అసిస్టెంట్ వాణి, రైతులు పాల్గొన్నారు.

చిందేపల్లి రోడ్డు ఆక్రమణపై నిరసన


నిరసన తెలుపుతున్న చిందేపల్లి గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణపై శుక్రవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ, చిందేపల్లి నుంచి పూతలపట్టు–నాయుడుపేట రోడ్డు వరకు గ్రామ ఆవిర్భావం నుంచి రోడ్డు ఉందన్నారు. గత ఏడాదిలో శ్రీకాళహస్తి మండలం ఈసీఎల్ కర్మాగార యాజమాన్యం రోడ్డును ఆక్రమించి గేటు ఏర్పాటు చేసిందన్నారు. అప్పట్లో పోరాటాలు చేయగా కంపెనీ పక్కన ఉన్న జగనన్న కాలనీ మీదుగా తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసినట్లు వివరించారు. రెండు రోజుల క్రితం తాత్కాలిక రోడ్డుకు కంపెనీ యాజమాన్యం గేటు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు.

విచ్చలవిడిగా అక్రమ ఇసుక రవాణా


కొత్తవీరాపురం స్వర్ణముఖి నదినుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టరు

సాక్షి టాస్క్‌ఫోర్స్: మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా విచ్చలవిడిగా జరుగుతోంది. మండలంలో ఎక్కడా ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ లేకున్నా కొత్తవీరాపురం, వికృతమాల, మడిబాక, మోదుగులపాలెం సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. టీడీపీ నాయకుల కనుసన్నల్లో రాత్రింబవళ్లు జేసీబీ ద్వారా ట్రాక్టర్లకు ఇసుక నింపి విక్రయించేస్తున్నారు. అధికారుల అనుమతులు లేకుండా గంపెడు ఇసుక నది నుంచి బయటకు వెళ్లరాదనే ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ ఇక్కడ వర్తించడంలేదు. గ్రామస్తులు ఎవరైనా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటే పలు కేసుల్లో ఇరికించేస్తామని టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు వాపోతున్నారు. యథేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా మైనింగ్, పోలీసులు, రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దారు భార్గవిని వివరణ కోరగా స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఇసుక తరలిస్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం లేదనడం గమనార్హం.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోండి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో ధరలు పెరిగిపోవడంతో సామాన్యులకు ఇసుక దొరకడం గగనమైందని సీఐటీయూ నాయకులు అన్నారు. ఆర్డీవో కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న ఇసుక విధానానికి వ్యతిరేకంగా శుక్రవారం సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పేరుకే ఇసుక ఉచితం అంటున్నారు కానీ, ఆచరణలో అది వ్యాపారంగా మారిందన్నారు. ఇసుక రీచ్ లేని కారణంగా అక్రమార్కులు ఇష్టానుసారంగా ధరలు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. నిఘా వ్యవస్థ నిద్రపోతుండడంతో ఇసుక ఇతర రాష్ట్రాలకు తరలుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వందవాసి నాగరాజు, గంధం మణి, రాపూరు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ దేవకుమారి

బుచ్చినాయుడుకండ్రిగ: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ దేవకుమారి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. బాలింతలు, గర్భవతులకు అవగాహన కల్పించి, గర్భిణులకు సీమంతం చేశారు. సీడీపీఓ మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా ఆహారంగా తీసుకోవాలని, దీనివల్ల ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పుట్టిన శిశువుకు గంట లోపే తల్లిపాలు పట్టిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని తల్లులు తప్పనిసరిగా శిశువులకు పాలు పట్టించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శిల్ప, యమున, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

8న జాబ్‌మేళా

సత్యవేడు: ఈ నెల 8న తమ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఉషాదేవి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. శ్రీసిటీకి చెందిన బహుళ జాతీయ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని, టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీటెక్ లేదా డిగ్రీ ఉత్తీర్ణత ఉన్న యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బయోడేటాతో హాజరు కావాలన్నారు.

ముక్కంటి సేవలో జేఎన్‌టీయూ కమిటీ సభ్యుడు


గురుదక్షిణామూర్తి సన్నిధిలో రామ్‌మనోహర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం జేఎన్‌టీయూ హయ్యర్ ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ రామ్ మనోహర్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుచ్చిపై విహారం


తిరుచ్చిపై భాష్యకారుడు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం భాష్యకారులు తిరుచ్చి వాహనం అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కైంకర్యాలను, శుక్రవార అభిషేకాలను పూర్తి చేశారు. అద్వైత మత ప్రబోధకులు భాష్యకారులకు అభిషేకం నిర్వహించి, ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం భాష్యకార్ల మాడవీధి ఊరేగింపు అనంతరం ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జిత అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు పర్యవేక్షించారు.

డీటీగా వెంకట సుబ్బయ్య



వరదయ్యపాళెం: డిప్యూటీ తహసీల్దార్‌గా వెంకటసుబ్బయ్య శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆర్ఐగా కేవీబీపురం మండలం నుంచి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ డీటీగా పనిచేస్తున్న శాంతి శ్రీకాళహస్తి ఆర్డీఓ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు.

రేణిగుంట డీఎస్పీగా శ్రీనివాసరావు



రేణిగుంట: స్థానిక డీఎస్పీగా శ్రీనివాసరావు శుక్రవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న వెంకటాద్రి ఇటీవల ఏఎస్పీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీనివాసరావు విధుల్లో చేరారు. రేణిగుంట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం చర్యలు చేపడుతానన్నారు.

సనాతన ధర్మాన్ని ఆచరిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న అశోకరాజు

నారాయణవనం: భారతీయులుగా ప్రతిఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు అన్నారు. శుక్రవారం కళాశాల ఆడిటోరియంలో ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఇటీవల తిరుమల లడ్డూ ప్రసాదం, సనాతన ధర్మాలపై ఎవరికి వారు తమకు తోచింది మాట్లాడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీషర్లు రెండు శతాబ్దాలకు పైగా పాలించి భారతీయుల్ని ఆర్యులుగా, ద్రవిడులుగా విడదీసినట్లు చరిత్ర చెబుతోందన్నారు. ఆర్యులంటూ ఎవరూ లేరని, ద్రవిడులు కూడా కాలానుక్రమంగా భారతీయ సాంప్రదాయాలు, సనాతన ధర్మానికి దూరమవుతున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ వసుధైక కుటుంబంగా వర్ధిల్లుతున్న మన దేశాన్ని యావత్తు ప్రపంచమే ఆదర్శంగా తీసుకొంటోందని, ప్రపంచవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు భగవద్గీతను ఒక పాఠ్యాంశంగా బోధిస్తున్నాయన్నారు. మనదేశంలో కూడా ప్రాథమిక స్థాయి నుంచే విద్యలో భగవద్గీతను, సనాతన ధర్మాన్ని అంశంగా చేర్చాలని బీజేపీ నాయకునిగా కేంద్రం దృష్టికి తెస్తామన్నారు. విద్య, గురువులు, తల్లిదండ్రుల, తోటి వారిపై గౌరవాన్ని ప్రదర్శించడం సనాతన ధర్మంలో భాగమని, దీనిని పార్టీలు, కులాలకతీతంగా భారతీయులందరూ పాటించడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధనరాజు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అమలు చేయాలని ధర్నా


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయకుండా ఇళ్లు కట్టుకుంటున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు పనులు లేక పస్తులతో అలమటిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించి జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు. తక్షణమే ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుబ్రమణ్యంకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ధనంజయులు, రమణయ్య, బాలగురవయ్య, జేకే రమణయ్య, కృష్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ


సమస్యలను తెలుపుతున్న ఉద్యోగులు, పెన్షనర్లు

రేణిగుంట: రైల్వే కల్యాణ మండపంలో శుక్రవారం రైల్వే ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసు సిబ్బంది క్యాంపును నిర్వహించారు. రేణిగుంట వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ చెంచు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొని వారి వ్యక్తిగత, సామూహిక సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. కొన్ని వినతులను అక్కడికక్కడే పరిష్కరించగా, మరి కొన్నింటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

కలుపు మందుతో భూమి నిస్సారం



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: పంటలకు అధికంగా కలుపు మందుల వాడకం వలన భూమి నిస్సారమై వ్యవసాయానికి పనికిరాకుండా పోతుందని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని వెస్టువరత్తూరులో కలుపు మందుల వాడకంపై రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలుపు మందులను మోతాదుకు మించి వాడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అలాగే వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు, కాకర, మిరపపంటల సాగు, చీడల పీడల నివారణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓలు వేణుగోపాలరావు, భారతి, వ్యవసాయ సహాయకులు భారత్, భారత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీ దేవిగా కాళికాదేవి కటాక్షం


శ్రీగాయత్రీ దేవిగా దక్షిణ కాళికాదేవి అమ్మవారు






కైలాసనాథ కోనలో కామాక్షిగా, సత్యవేడు: గాయత్రీదేవిగా, వరదయ్యపాళెం: ధనలక్ష్మిగా, శ్రీకాళహస్తి: బ్రహ్మచారిణిగా, బాలా త్రిపురసుందరిగా..


కోబాకలో గౌరీ దేవిగా పోలినాంచారమ్మ దేవి

శ్రీకాళహస్తి: పాహిమాం మాత పాహిమాం అంటూ భక్తులు ఆలయాల్లో బారులు తీరారు. దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబ మహావిష్ణువుగా, బొమ్మలకొలువులో బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని ముత్యాలమ్మను బ్రహ్మచారిణిగా అలంకరించారు. బజారువీధిలోని కన్యాకాపరమేశ్వరి రేణుకాదేవిగా, పానగల్‌లో ఉన్న గంగమ్మ కామాక్షిగా, భాస్కరపేటలో ఉన్న చాముండేశ్వరి భవానీగా, తెట్టు వద్ద ఉన్న నల్లగంగమ్మ బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని వేడంలో ఉన్న దక్షిణ కాళికాదేవి గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు.

ఏర్పేడు: మండలంలోని కోబాకలో పోలినాంచారమ్మ దేవి గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఎండీ పుత్తూరు యల్లమ్మ దేవి, పాపానాయుడుపేట భద్రకాళీదేవి, గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని ఆనందవల్లీ దేవి అమ్మవార్లు గౌరీ దేవి అలంకరణలో పూజలందుకున్నారు.

బాలత్రిపుర సుందరిగా కటాక్షం

నారాయణవనం: మండలంలో సముదాయంలోని అవనాక్షమ్మ బాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. కైలాసనాథ కోనలోని కామాక్షాంబిక స్వర్ణకవచాన్ని ధరించి కంచి కామాక్షిగా దర్శనమిచ్చారు. స్థానిక ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీదేవి అన్నపూర్ణగా ఉయ్యాలసేవలో కటాక్షించారు.

పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో..

నాగలాపురం: మండలంలో సురుటుపల్లె పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో మీనాక్షి అలంకరణలో మరకదాంబిక అమ్మవారు కటాక్షించారు.

సత్యవేడు: స్థానిక ఆలయంలోని లలితాదేవి అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వరదయ్యపాళెం: స్థానిక చెంగాళ పరమేశ్వరిదేవి ధనలక్ష్మిగా, అంబూరులోని కామాక్షిదేవి గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.